ప్రైవేటీకరణ ఆలోచన దుర్మార్గం



14ఏళ్ల పాటు ముఖ్యమంత్రిగా చేసిన చంద్రబాబునాయుడు ఏనాడు వైద్య విద్యను ప్రోత్సహించలేదు. అన్నింటినీ ప్రైవేటు పరం చేస్తూ వచ్చారు. మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో మెడికల్ కళాశాలలను ఏర్పాటుకు కృషి చేశారు. కూటమి ప్రభుత్వం ఆ మెడికల్ కాలేజీలను ప్రైవేటు పరం చేయాలని చూడటం దుర్మార్గం. ఎంబీబీఎస్ సీట్లు పెరిగితే పేద విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని పార్టీలకు సంబంధం లేకుండా ప్రభుత్వం విద్య, వైద్యానికి ప్రాధాన్యత ఇవ్వాలి. వైద్య విద్యను దూరం చేసి విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకోరాదు.

–చంద్రశేఖర్‌రెడ్డి, రిటైర్డు ప్రిన్సిపాల్, నంద్యాల



లేఖను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలి



ప్రభుత్వం వైద్య కళాశాలలు వద్దంటూ చంద్రబాబు ప్రభుత్వం లేఖరాయడం కుట్రలో భాగమే. పేదలకు వైద్య విద్యను దూరం చేయాలని ప్రభుత్వం చూస్తుంది. నూతన ప్రభుత్వ కళాశాలలతో పేద విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతుంది. ర్యాంకు తక్కువ వచ్చినా సీట్లు లభిస్తాయి. వైద్య విద్యను అభ్యసించాలన్నా విద్యార్థుల ఆకాంక్షలను ప్రభుత్వం ముందుకు తీసుకెళ్లాలి. వెంటనే కేంద్రానికి రాసిన లేఖను ఉపసంహరించుకోవాలి. వైద్య, విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడితే భవిష్యత్తులో గుణపాఠం తప్పదు.

–షేక్ మహమ్మద్ రఫీ, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు, నంద్యాల

క్లుప్తంగా

పదోన్నతుల్లో ప్రాధాన్యత కల్పించాలి



మాట్లాడుతున్న అసోసియేషన్ అధ్యక్షుడు మస్తాన్‌వలి

నంద్యాల(న్యూటౌన్): వికలాంగ ఉద్యోగులకు ప్రమోషన్లలో ప్రాధాన్యత కల్పించాలని డిజేబుల్డ్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మస్తాన్‌వలి, మరియదాసు డిమాండ్ చేశారు. శనివారం నంద్యాల పట్టణంలోని ఎన్‌జీఓ హోం కార్యాలయంలో నంద్యాల జిల్లా వికలాంగ ఉద్యోగస్తుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యా హక్కులను, చట్టాలను సక్రమంగా అమలు చేయాలన్నారు. వికలాంగ జీవోలు పేపర్‌కు మాత్రమే పరిమితం కాకుండా వాటిని అమలు చేయాలన్నారు. నంద్యాల జిల్లా వికలాంగుల సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు మురహరి రావు, కార్యదర్శి జహరుద్దీన్, కోశాధికారి జలీల్‌బాషా మాట్లాడుతూ వికలాంగుల సమస్యలపై నిరంతరం పోరాటాలు చేస్తామన్నారు.

అంబేడ్కర్ మార్గంలో నడవాలి



అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న బీఎస్‌ఐ నాయకులు

నంద్యాల(అర్బన్): బాబాసాహెబ్ అంబేడ్కర్ మార్గం అనుసరణీయమని, ఆయన పాటించిన బౌద్ధ సంస్కృతి, సంప్రదాయాల్లో జీవించిన నాడే ఈ దేశం ప్రభుద భారతదేశమవుతుందని బీఎస్‌ఐ నంద్యాల జిల్లా అధ్యక్షుడు రెడ్డిపల్లె ఓబయ్య తెలిపారు. స్థానిక నూనెపల్లె ఎస్‌ఆర్ నగర్‌లో శనివారం ది బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా జిల్లా కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో విజయదశమి సందర్భంగా నిర్వహించే కార్యక్రమాల్లో ప్రతి సభ్యుడు పాల్గొని సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటరమణ, లాయర్ జీవన్, శ్రీనివాసులు, బాలకృష్ణ, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'అధికారపార్టీ నాయకులు అక్రమాలకు పాల్పడుతున్నారు'



మాట్లాడుతున్న ఎంవీఆర్‌పీఎస్ నాయకులు

నంద్యాల(అర్బన్): పట్టణ శివారులోని వైఎస్సార్ నగర్, నందమూరినగర్ ప్రాంతాల్లో కొందరు అధికార పార్టీ నాయకులు పేదల ఇళ్ల స్థలాలను ఆక్రమించుకుంటున్నారని ఎంవీఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బోయపులికొండన్న ఆరోపించారు. స్థానిక దేవనగర్‌లోని వాల్మీకి ఆలయ ఆవరణలో శనివారం ఆయన మాట్లాడుతూ 2013లో వాల్మీకులకు నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఇళ్ల పట్టాలు ఇచ్చిందన్నారు. గూడు కట్టుకొనే స్థోమత లేక కొందరు బేస్‌మెంట్ లెవెల్‌తో స్థలాలను ఉంచుకున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కొందరు ఆ స్థలాలపై కన్నేశారన్నారు. వాల్మీకులను బెదిరిస్తున్నారన్నారు. తీరు మార్చుకోకపోతే వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు తిమ్మయ్య, మల్లికార్జున, రాజు, పరమేష్, రమేష్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

అతిసార నియంత్రణకు చర్యలు



బాధితులతో మాట్లాడుతున్న కలెక్టర్, ఎమ్మెల్యే

ఆళ్లగడ్డ: పట్టణంలో అతిసార నియంత్రణకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియా, ఎమ్మెల్యే అఖిలప్రియ అన్నారు. అతిసార వ్యాధి ప్రబలిన వీధుల్లో శనివారం వారు పర్యటించి బాధితులతో మాట్లాడారు. అతిసార పూర్తి అదుపులో ఉందన్నారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ప్రస్తుతం పట్టణంలో 11 ఆక్టివ్ కేసులు మాత్రమే ఉన్నాయన్నారు. ప్రజలు ఎలాంటి ఆహారం, నీరు తీసుకోవాలన్న విషయాలపై కర పత్రాలు ముద్రించి ఇంటింటికి పంచాలని మునిసిపల్ అధికారులకు సూచించారు.



- పూర్తిగా దెబ్బతిన్న సాంబవరం- నూనెపల్లె రోడ్డు
- రాకపోకలకు ఇబ్బంది పడుతున్న ప్రజలు

రాజీయే రాజమార్గం



సమావేశంలో మాట్లాడుతున్న 5వ అదనపు జిల్లా జడ్జి మురళీకృష్ణ

ఆళ్లగడ్డ: కక్షిదారులకు రాజీయే రాజమార్గమని ఆళ్లగడ్డ 5వ అదనపు జిల్లా జడ్జి మురళీ కృష్ణ అన్నారు. స్థానిక కోర్టు హాలులో శనివారం నిర్వహించిన జాతీయ మెగా లోక్ అదాలత్‌కు విశేష స్పందన లభించింది. మొత్తం 84 కేసులు పరిష్కారం కాగా ఇందులో ఎంటపీ 13, ఈపీఎస్ 13, ఓస్ (ఎం) 2, ఓఎస్ (టి)4, ఐపీసీసీ 50, పీఎల్‌సీ 2 కేసులు పరిష్కరించడం జరిగిందన్నారు. ఇందులో రూ. 1,54,98,873 కక్షి దారులకు పరిహారం కింద చెల్లించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లోక్ అదాలత్ ద్వారా ఇరువురికి న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి ఈశ్వరా వెంకటప్రసాద్, ఏపీపీ సోమశేఖర్‌రెడ్డి, న్యాయవాదులు ఉన్నారు

నంద్యాల(వ్యవసాయం): లోక్ అదాలత్ ద్వారా కక్షిదారులకు సత్వర న్యాయం జరుగుతుందని నంద్యాల జిల్లా మూడవ అదనపు జిల్లా జడ్జి వాసు పేర్కొన్నారు. శనివారం నంద్యాల జిల్లా కోర్టు ఆవరణలో జాతీయ లోక్‌అదాలత్ నిర్వ నంద్యాలలో సీసీ కేసులు 101, సివిల్ కేసులు 18, ఈపీ 31, ఎంసీ 4, డీవీసీ 2, ఎన్‌ఐ యాక్ట్ 5, పెట్టీ కేసులు 860, బ్యాంకు కేసులు 8, ఎంవీఓపీ కేసులు 68 మొత్తం 1,097 కేసులు పరిష్కరించడంతో పాటు పలు కేసుల్లో కక్షిదారులకు రూ.2.45 కోట్ల పరిహారం అందించామన్నారు.

సీతారాం ఏచూరి పోరాటం స్ఫూర్తిదాయకం



సంతాప సభలో మాట్లాడుతున్న రమేష్‌కుమార్

నంద్యాల(న్యూటౌన్): భారత కమ్యూనిస్టు పార్టీ (మార్కిస్ట్) జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణకు చేపట్టిన పోరాటం స్ఫూర్తిదాయకమని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్‌కుమార్ అన్నారు. స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో సంతాప సభ నిర్వహించారు. విద్యార్థి నాయకుడిగా, కార్మిక వర్గ శ్రేయోభిలాషిగా ఆయన వ్యవహరించిన పాత్ర అమోఘమన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు రాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంఆర్‌నాయక్, హర్ష, కిశోర్, హుసేన్, తదితరులు పాల్గొన్నారు.

ఏచూరికి నివాళి

రుద్రవరం: ఇటీవల సీపీఎం అగ్రనేత సీతారాం ఏచూరి మృతిచెందడంతో మండల పరిధిలోని ఎల్లావత్తులలో శనివారం ఆ పార్టీ నాయకులు ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రామచంద్రుడు మాట్లాడుతూ ఏచూరి కార్మికులు, రై తులు, కూలీలు, ఉపాధ్యాయ రంగ సమస్యలపై ఎన్నో పోరాటాలు చేశారన్నారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటు అన్నారు. కార్యక్రమంలో నాయకులు శాంతమ్మ, సుదర్శన్, వెంకటేశ్వర్లు, మాబాషా, నడిపి వుశేన్, తదితరులు ఉన్నారు.

ఉద్యోగులకు 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాగరాజు

నంద్యాల(న్యూటౌన్): ఉపాధ్యాయ ఉద్యోగులకు 30 శాతం మధ్యంతర భృతి వెంటనే ప్రకటించాలని ఎస్‌టీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు నాగరాజు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక కార్యాలయంలో జరిగిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగులందరికీ మధ్యంతర భృతి ప్రకటించాలని, 12వ పీఆర్‌సీ కమిషన్‌ను నియమించి నిర్ణీత కాల పరిమితంలోపు నివేదిక తెప్పించుకొని వీలైనంత త్వరగా అమలు చేయాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ 117వ జీవోను రద్దు చేయాలని, సీపీఎస్, జీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరింజేయాలని కోరారు. పాఠశాల స్థాయిలో యాప్‌లను రద్దు చేసి ఉపాధ్యాయులను బోధనకు మాత్రమే పరిమితం చేయాలన్నారు. పని సర్దుబాటు ప్రక్రియలో అసంబంధాలను తొలగించి 1998, 2008 డీఎస్సీ ఉపాధ్యాయులకు 62 సంవత్సరాల పదవీ విరమణ వయస్సు పెంచాలని కోరారు. సమావేశంలో ఎస్‌టీటీఎఫ్ నాయకులు రాము, రామకృష్ణ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

అతిసారంపై అవగాహన



అతిసారంపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ నాగేంద్ర

దొర్నిపాడు: అతిసారం పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని వైద్యాధికారి నాగేంద్ర సూచించారు. శనివారం ఆయన మండలంలోని క్రిష్టిపాడు గ్రామంలో ఉన్న హెల్త్ క్లినిక్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన వైద్యశాలలోని రికార్డులు, మందులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆయన అతిసారపై గ్రామస్తులు, వైద్య సిబ్బందికి అవగాహన కల్పించారు. నీళ్ల విరేచనాలు, జర్వం వంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. ముఖ్యంగా అన్నీ గ్రామ హెల్త్ సెంటర్లలో 2వేలకు పైగా ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఓఆర్‌ఎస్ తీసుకోవడం వల్ల నీరసం కాకుండా రోగికి నూతన శక్తి వస్తుందన్నారు. అవసరమైతే గ్రామ హెల్త్ సెంటర్లోనే సైలైన్స్ బాటిళ్లు పెడుతున్నట్లు చెప్పారు. కాచివడగట్టిన నీటిని తీసుకోవడంతో పాటు మజ్జిగను బాగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ విమల, హెల్త్‌సూపర్‌వైజర్ సాయికృప, పుల్లయ్య, ఏఎన్‌ఎం మాణిక్యమ్మ, ఆశా వర్కర్లు, విజయలక్ష్మి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మహిళా కానిస్టేబుల్‌పై కక్ష సాధింపు తగదు



మాట్లాడుతున్న గన్ని, అబ్దుల్‌కరీం

నంద్యాల(అర్బన్): గుంటూరు జిల్లా కారాగారంలో వైఎస్సార్‌సీపీ నాయకుల పరామర్శకు వచ్చిన మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితో సెల్ఫీ దిగిన ముస్లిం మహిళా కానిస్టేబుల్ ఆయేషాభానుపై కూటమి ప్రభుత్వం కక్షసాధింపు చర్యలు చేపట్టడం దారుణమని నంద్యాల ముస్లిం జేఏసీ కన్వీనర్ గన్ని అబ్దుల్‌కరీం అన్నారు. స్థానిక కార్యాలయంలో శనివారం జేఏసీ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కానిస్టేబుల్ ఆయేషాభాను ఏం నేరం చేశారని చార్జ్ మెమో ఇస్తారని ప్రశ్నించారు. అభిమానంతో ఎంతో మంది రాజకీయ నాయకులతో ఉద్యోగులు ఫొటోలు దిగడం సాధారణమని జగన్‌మోహన్‌రెడ్డిపై ఉన్న అభిమానంతోనే ఆయేషాభాను ఆయనతో సెల్ఫీ దిగిందని, ప్రభుత్వం నేరంగా పరిగణించడం సరికాదన్నారు. చార్జ్ మెమోను వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ కో కన్వీనర్ మహబూబ్‌బాషా, సభ్యులు ఇద్రూస్, దాదాభాయ్, సుహేల్‌రాజా, జుబేర్, ఖాజాహుసేన్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డంతా గతుకులే!



దారిలో ఏపుగా పెరిగిన కంపచెట్లు

గోస్పాడు: గ్రామీణ రహదారులు శిథిలావస్థకు చేరాయి. దీంతో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని సాంబవరం గ్రామం నుంచి చాబోలు మీదుగా నూనెపల్లెకు వెళ్లే బీటీ రహదారి పూర్తిగా దెబ్బతినింది. దారి పొడవునా కంకరతేలి పెద్ద పెద్ద గుంతలు పడ్డాయి. దీంతో అటువైపు వెళ్లే వాహనదారులు నిత్యం నరక యాతన పడుతున్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో రహదారి గుంతల్లో వర్షపునీరు నిలిచిపోతుండటంతో ప్రయాణం మరింత ఇబ్బందిగా మారింది. గుంతలు ఎక్కడున్నాయో తెలియని పరిస్థితి నెలకొంది. కొందరు గుర్తించలేక ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి రహదారిని బాగుచేయడంతో పాటు రోడ్డు పక్కనే ఉన్న కంపచెట్లను తొలగించి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని వాహనదారులు, ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఆధ్యాత్మికం

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



ఉయ్యాలవాడ : మండలంలోని ఆర్.జంబులదిన్నె, ఉయ్యాలవాడ, ఇంజేడు, సుద్దమల్ల గ్రామాల్లో వెలిసిన ఆలయాల్లో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. శ్రీ అభయాంజనేయ స్వామికి, శ్రీ లక్ష్మీవెంకటేశ్వరస్వామి, శ్రీ లక్ష్మీనరసింహ కంబగిరిస్వామికి అభిషేకాలు, కుంకుమార్చన, ఆకుపూజతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం వారికి అర్చకులు లక్ష్మణస్వామి, భాస్కరశర్మ, అనంతయ్య, కమలేష్‌శర్మ తీర్థ ప్రసాదాలు అందజేశారు.

అవీ-ఇవీ

సబ్సిడీపై గడ్డి కోత యంత్రాలు

ఉయ్యాలవాడ : సబ్సిడీపై పశు గ్రాసం కటింగ్ యంత్రాలు అందజేస్తున్నట్లు పశు వైద్యాధికారి రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. కటింగ్ యంత్రం రూ. 33,984 కాగా సబ్సిడీ పోను రూ. 20,380కు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. కావాల్సిన రైతులు ఆయా పశు వైద్యశాలలు లేదా రైతు సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అలాగే పశువులకు సమీకృత దాణా పశు వైద్యశాలలో అందుబాటులో ఉందని, కావాల్సిన రైతులు పొందవచ్చునని శనివారం ఓ ప్రకటనలో కోరారు.

వారిపై చర్యలు తీసుకోవాలి

నంద్యాల(న్యూటౌన్): పాములపాడు మండలం బానకచర్ల గ్రామంలో ప్రభుత్వ భూమిని కబ్జా చేసుకొని ఆన్‌లైన్ చేసుకున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టపర చర్యలు చేపట్టాలని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కబ్జాకు గురైన భూమిలో 30సంవత్సరాలుగా 120 దళిత కుటుంబాలు నివాస స్థలాలు ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తుంటే హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న కొందరు రెవెన్యూ అధికారులను అడ్డుపెట్టుకొని ఆన్‌లైన్‌లో వారి పేరు ఎక్కించుకోవడం దుర్మార్గమన్నారు. అధికారులు స్పందించి దీనిపై విచారణ చేపట్టాలన్నారు.

విజ్ఞానం పెంచుకోవాలి

నంద్యాల(న్యూటౌన్): విద్యార్థులు విజ్ఞానం పెంచుకోవాలని డాక్టర్ రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు పట్టణంలోని ఫరూక్ నగర్ శ్రీశారదా విద్యాపీఠం హైస్కూల్‌లో గణిత విజ్ఞాన మేళా సంస్కృతి మహోత్సవం కార్యక్రమం జరిగింది. తిరుపతి, అనంతపురం, కర్నూలు, సత్యసాయి, కడప జిల్లాల నుంచి 350మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా డాక్టర్ చక్రధర్‌రెడ్డి, న్యూరాలజిస్ట్ డాక్టర్ సునీత, డాక్టర్ రామకృష్ణారెడ్డి హాజరై మాట్లాడారు.

పంట నమోదు చేయించుకోండి

గోస్పాడు: రైతులు తమ పంట నమోదు, ఈకేవైసీని త్వరగా పూర్తి చేసుకోవాలని వ్యవసాయాధికారి స్వప్నికారెడ్డి తెలిపారు. స్థానిక కార్యాలయంలో శనివారం ఆమె మాట్లాడుతూ పంటనమోదు, ఈకేవైసీ నమోదుకు ఆదివారం చివరి రోజు అన్నారు. ప్రభుత్వం ద్వారా అందే పంట నష్టపరిహారం, ఇన్సూరెన్స్, మద్దతుధరకు పంట కొనుగోలు వంటి వాటికి ఈ క్రాప్ బుకింగ్ అవసరమన్నారు.

క్రైం కార్నర్

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఒకరు మృతి

- ఇరువురికి తీవ్ర గాయాలు



పెద్దకంబలూరు మెట్ట వద్ద మృతి చెందిన చెన్నయ్య

రుద్రవరం: మండలంలో వేర్వేరు చోట్ల శనివారం జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఒకరు మృతి చెందగా మరో ఇద్దరు తీవ్ర గాయాల పాలయ్యారు. వివరాల్లోకి వెళితే.. మండల పరిధిలోని పెద్దకంబలూరు గ్రామానికి చెందిన చెన్నయ్య(40)అనే వ్యక్తి శనివారం మోటార్ సైకిల్‌పై సీఎం రోడ్డుపై ఉన్న మెట్ట వద్దకు వెళ్లి ఇంటికి తిరిగి వస్తుండగా ప్రమాదవశాత్తు అదుపు తప్పి కింద పడ్డాడు. ఈ ఘటనలో తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. వ్యవసాయ పనులు చేస్తూ జీవనం సాగించే మృతుడికి భార్య మేరీతో పాటు నలుగురు పిల్లలు ఉన్నారు.

- మండల పరిధిలోని అప్పనపల్లెకు చెందిన మల్లికార్జున, నాగేశ్వరమ్మ అనే ఇద్దరు బైక్‌పై రుద్రవరం సమీపంలోని వాసాపురం వెంకటేశ్వర స్వామి ఆలయానికి వెళ్తున్నారు. మార్గ మధ్యంలో అప్పనపల్లె మలుపు వద్ద ఎల్లావత్తులకు చెందిన శీను బైక్ ఎదురెదురై ఢీకొన్నాయి. ఈ ఘటనలో మల్లికార్జున, నాగేశ్వరమ్మ అనే ఇద్దరికి తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం 108 వాహనంలో నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు గ్రామస్తులు తెలిపారు.

గురప్ప స్వామి గుడిలో హుండీ కానుకల చోరీ

ఉయ్యాలవాడ : మండలంలోని ఇంజేడు గ్రామంలో వెలిసిన గురప్ప స్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. శనివారం ఉదయం గ్రామానికి చెందిన పొట్లోళ్ల గురప్ప ఆలయంలో పూజ చేసేందుకు వెళ్లగా హుండీ పగలగొట్టి వస్తువులు చెల్లా చెదురుగా పడేసిన దృశ్యాలు కనిపించాయి. వెంటనే విషయాన్ని గ్రామస్తులకు తెలియజేయడంతో వెంకటసుబ్బయ్య, సుబ్రమణ్యం, గురుశంకర్, నరసింహుడు తదితరులు ఆలయానికి చేరుకుని పరిశీలించారు. రెండు సంవత్సరాల నుంచి హుండీలోని కానుకలను లెక్కించలేదని, అందులో వెండి వస్తువులు, నగదు రూ. 50 వేల మేర ఉండొచ్చని వారు తెలిపారు. చోరీ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు వారు వెల్లడించారు.

బిల్డింగ్ కూల్చి వేస్తే ఆత్మహత్య చేసుకుంటాం

భవనం ఎక్కి ఉరుకుందు కుటుంబం నిరసన



పురుగు మందు డబ్బాతో బిల్డింగ్ పైకి ఎక్కి ఆత్మహత్య చేసుకుంటామంటున్న ఉరుకుందు కుటుంబం

నంద్యాల(అర్బన్): నంద్యాల బైపాస్ రోడ్డులోని శిల్పానగర్‌కు చెందిన ఉరుకుందు అనే వ్యక్తి కుటుంబంతో కలిసి ఆత్మహత్య చేసుకునేందుకు యత్నించాడు. ఈయన నిర్మించుకున్న ఇల్లు వక్ఫ్ బోర్డు స్థలంలో ఉందని శనివారం మునిసిపల్ అధికారులు కూల్చివేసేందుకు వచ్చారు. దీనిని అడ్డుకుంటూ ఉరుకుందు కుటుంబంతో కలిసి భవనంపైకి ఎక్కి పురుగుల మందు తాగేందుకు ప్రయత్నించగా పోలీసులు నివారించారు. తాను సెంటు రూ.10 లక్షల చొప్పున 8 సెంట్ల స్థలం కొనుగోలు చేసి, అందులో రూ.70 లక్షలు వెచ్చించి ఇంటి నిర్మాణం చేపట్టానని బాధితుడు తెలిపాడు. వక్ఫ్‌బోర్డు స్థలంలో ఇల్లు ఉందని ఇప్పుడు కూల్చివేస్తే కుటుంబం రోడ్డున పడుతుందని వాపోయాడు. రాష్ట్ర న్యాయ శాఖ మంత్రి ఫరూక్ స్పందించి న్యాయం చేయాలని కోరారు. దీనిపై వక్ఫ్‌బోర్డు జిల్లా అధికారిణి సబిహా వివరణ కోరగా వక్ఫ్ స్థలంలో అక్రమంగా భవనం, షాపులు నిర్మించడమే కాక ఆత్మహత్య చేసుకుంటామని ఉరుకుందు భయపెట్టడం తగదని చట్టపరంగా ఆయనపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.